సాక్షి జనగామ

7

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



వనజీవికి నివాళి

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రామయ్య
- ఆయనతో అనుభవాలను పంచుకున్న జిల్లావాసులు

8లో▸

నిట్‌లో మేడారం జాతరపై జరిగిన జాతీయ ఓరియంటేషన్‌లో రామయ్య దంపతులను సన్మానించిన కార్యక్రమ బాధ్యులు (ఫైల్)

న్యూస్‌రీల్

మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

జనగామ రూరల్: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ప్రకటిస్తూ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ ఆదివారం, 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా మార్కెట్ బందు ఉంటుందని, రైతులు గమనించి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడానికి తీసుకురావొద్దని సూచించారు. మంగళవారం మార్కెట్ తిరిగి పునఃప్రారంభం అవుతుందన్నారు.

షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం స్థానికంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య ఆధ్వర్యాన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇనుగాల యుగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.సాంబన్న, దేవ్‌సింగ్, రాజిరెడ్డి, చుక్కమ్మ, ప్రధాన కార్యదర్శిగా అన్నెపు కుమార్, సహాయ కార్యదర్శులుగా రాజు, సాంబరాజు, చందర్, అశోక్, ఉదయ్‌కిరణ్, కోశాధికారిగా చింతకింది సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా నరేష్, అరవింద్, దిలీప్, రమేష్, మధుసూదన్, చందర్, రాజు, మధు, రమేష్, మహేష్ ఎన్నికయ్యారు.

రాజరాజేశ్వరీదేవికి తామర పూలతో అర్చన



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలలితా యాగంలో భాగంగా శనివారం అమ్మవారికి లక్ష తామరపూలతో అర్చన చేశారు. ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఉదయం తామరపూలతో అర్చన నిర్వహించారు. సాయంత్రం పౌర్ణమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి లక్ష బిల్వార్చన చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపారాధన చేశారు. దశ విధహారతుల అనంతరం అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వర రావు పర్యవేక్షించారు.

'మిస్ వరల్డ్ పోటీలు రద్దు చేయాలి'

హన్మకొండ: రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని ప్రొఫెసర్ కాత్యాయని అన్నారు. హనుమకొండలో మిస్ వరల్డ్ పోటీలపై అందాల పోటీల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ కాత్యాయని మాట్లాడుతూ.. అందాన్ని ఆనందిస్తాం.. కానీ అందం పెట్టుబడి కావడమే సమస్యగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు కార్పొరేట్ సంస్థలు ఇలాంటివి నిర్వహించేవని, ఇప్పుడు ఏకంగా ప్రభుత్వమే నిర్వహించడంలో ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో అర్థమవుతుందని విమర్శించారు. ప్రభుత్వాలు ప్రజలను ప్రజాసమస్యలను పట్టించుకోకుండా పెట్టుబడిదారులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని రూ.200 కోట్ల ఖర్చుతో నిర్వహిస్తే రూ.1,500 కోట్ల లాభాలు వస్తాయని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మహిళా ప్రతినిధి కళ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్లు దోచుకొని ఓటమికి గురయ్యారన్నారు. ఆయన అన్యాయాలు భరించలేకే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆరు గారెంటీలతో గద్దెనెక్కిస్తే.. గ్యారెంటీలను గాలికి వదిలి లాభాలే లక్ష్యంగా పాలన చేస్తున్నారని తూర్పారబట్టారు. సమావేశంలో రత్నమాల, రమాదేవి, వెంగల్‌రెడ్డి, అంజనీ, విలాసిని, జ్యోతికరమణి పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు



ఎంజీఎం: వరంగల్ కాశిబుగ్గలోని సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడు జి.సదానందంపై కేసు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు శనివారం తెలిపారు. అశాస్త్రీయ పద్ధతిలో హైడోస్ యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు ఇవ్వడంతో పాటు ఫార్మసీ లైసెన్స్ లేకుండా పెద్ద మొత్తంలో మందులు నిల్వ ఉంచినట్లు సభ్యులు గుర్తించారు. ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో రిజిస్టర్డ్ డాక్టర్ డి.లాలయ్యకుమార్, చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ఎంసీ చట్టం సెక్షన్ 34, 54, టీఎస్ఎంపీఆర్ చట్టం సెక్షన్ 22 ప్రకారం.. ఈకేసు నమోదు చేశారు. చట్ట ప్రకారం నకిలీ వైద్యుడికి జైలు శిక్ష రూ.5 లక్షలు జరిమానా విధించే అవకాశం ఉందని కౌన్సిల్ సభ్యులు నరేశ్ పేర్కొన్నారు.

మళ్లీ సమ్మెబాట!

గ్రామసేవకులపై పట్టింపేది..?

- ఐదు నెలలుగా అందని వేతనాలు
- కుటుంబాలు గడవక ఇబ్బందులు
- కనీసవేతనం, ఉద్యోగ భద్రత కరువు
- తిరిగి సమ్మెబాట పట్టనున్న కార్మికులు..!
- అధికారులకు సమ్మె నోటీసులు అందజేసిన కార్మిక నాయకులు



ఖిలాషాపురంలో విధులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

జనగామ రూరల్: గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి.. పల్లెలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.. మురికి కాల్వలు, వార్డులు శుభ్రం చేయడం.. చెత్త తరలింపు.. నీటి సరఫరా.. కరెంటు సమస్యల పరిష్కారం.. ఇలా పొద్దంతా అన్ని రకాల పనులతో చాకిరీ చేస్తున్న గ్రామ సేవకులకు ఇచ్చేది అరకొర వేతనమే. అదికూడా సమయానికి అందక కుటుంబాలు గడవక పడరాని పాట్లు పడుతున్నారు. డిమాండ్ల సాధనకు గతంలో సమ్మె చేయగా.. కంటి తుడుపుగా కొన్ని హామీలు ఇచ్చిన పాలకులు చేతులు దులుపుకున్నారు. అయితే గత ఐదు నెలల నుంచి వేతనాలు రావడంలేదు. దీంతో మళ్లీ సమ్మె బాట పట్టేందుకు పంచాయతీ కార్మికులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే యూనియన్ నాయకులు అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు.

1,210 మంది జీపీ కార్మికులు

జిల్లాలో 281 గ్రామ పంచాయితీలు ఉండగా 1,210 మంది జీపీ కార్మికులు మల్టీపర్పస్ విధులు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వర్కర్ల సంఖ్య లేదు. 25 శాతం తక్కువగా ఉన్నారు. అదనపు పనిభారం పడుతోంది. గ్రామ పంచాయతీల్లో మల్టిపర్పస్ విధానం కారణంగా అన్ని రకాల పనులు చేయించడంతో కార్మికులకు కష్టాలు తప్పడంలేదు. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న వీరికి అరొకరగా చెల్లించే రూ.9,500 వేతనం నెలల తరబడి అందక కుటుంబాలు గడవక అప్పులు చేస్తూ కాలం గడుపుతున్నారు. మల్టీపర్పస్ విధానం కార్మికుల ప్రాణాల మీదికి వస్తోంది. రెండు రోజుల క్రితం రఘునాథపల్లి మండలం మేకలగట్టుకు చెందిన కారోబార్ వేల్పుల నాగరాజు విద్యుత్ సమస్య పరిష్కారం కోసం స్తంభం ఎక్కవగా విద్యుత్ షాక్ గురయ్యాడు.



విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన కార్మికుడు నాగరాజు (ఫైల్)

జీపీ కార్మికుల డిమాండ్లు ఇవీ..

- పర్మనెంట్ చేసి రేగ్యులర్‌గా వేతనం చెల్లించాలి.
- జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్, కారోబార్లకు రూ.19,500 చెల్లించాలి.
- జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి.
- ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలి.
- అనారోగ్యంతో మరణిస్తే కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- ఏడాదికి కార్మికులకు మూడు జతల యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెల కొనుగోలుకు నగదు రూపంలో అలవెన్స్ చెల్లించాలి.
- ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి.
- కార్మికుల అక్రమ తొలగింపులు ఆపి ఉద్యోగ భద్రత కల్పించాలి.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



గ్రామాల్లో జీపీ కార్మికులతో అన్ని రకాల పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం.. వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. కార్మికులకు ప్రాణాంతకంగా మారిన మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. ఇచ్చేది అరకొర వేతనం. అదికూడా ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో కార్మికుల కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చకుంటే ఈనెల 19 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్తాం.

– రాపర్తి రాజు, జీపీ కార్మికుల ఉద్యోగ కార్మికుల గౌరవ అధ్యక్షుడు

నెలనెలా అప్పు చేయాల్సి వస్తోంది..



పెరిగిన ధరలకు వచ్చే రూ.9,500ల జీతం ఎటూ సరిపోవడం లేదు. మాకు ఇద్దరు పిల్లలు. భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నెలనెలా అప్పులు చేయాల్సి వస్తోంది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను.

– మల్లేష్, జీపీ కార్మికుడు, ఎర్రగొల్లపహడ్

కూలి కూడా గిట్టడం లేదు..



నెలంతా పని చేస్తే రోజువారీ కూలి కూడా గిట్టడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో మురికి కాల్వలు, వార్డులు శుభ్రం చేయడం.. చెత్త తరలింపు.. నీటి సరఫరా తదితర పనులు చేస్తున్నాం. వచ్చే అరకొర జీతంతో ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ పనులకు పోదామంటే సమయం దొరకదు. పొద్దంతా ఇదే చాకిరి. అప్పు తెచ్చుకుని పూట గడుపుతున్నాం.

– బొల్లం లక్ష్మి, జీపీ కార్మికురాలు, వడ్లకొండ

జై హనుమాన్

- వైభవంగా హనుమాన్ జయంతి

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యాన హనుమాన్ విగ్రహాలతో భారీ ఊరేగింపులు చేపట్టారు. జనగామ పట్టణంలో రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు శోభాయాత్ర కనుల పండువగా సాగింది. చిన్నా పెద్ద తేడా లేకుండా హనుమాన్ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భజనల మధ్య నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ చేతన్ నితిన్ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు మంచాల రవీందర్, సౌడ రమేశ్‌తోపాటు కేవీఎల్ఎన్.రెడ్డి, మహంకాళీ హరిశ్చంద్రగుప్త, డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, బాలనారాయణ, సుంచు శ్రీకాంత్, రంగ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



జనగామ పట్టణంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, చిన్నారులు

బీజేపీ పాలనలో రాజ్యాంగంపై దాడి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ పాలనలో భారత రాజ్యాంగంపై దాడి జరుగుతున్నది.. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంపై శనివారం స్థానికంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని, అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో మాట్లాడారని అన్నారు. ప్రజలను చైతన్యం చేస్తూ ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త రాజ్యాంగ పరిరక్షణకు బాధ్యతగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాపాడుకుంటే మనల్ని కాపాడుతుందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులు ప్రజలతో కలిసి జాతీయ జెండా, అంబేడ్కర్, గాంధీజీ ఫొటోలతో గ్రామాల్లో ర్యాలీలు, పాదయాత్రలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ లకావత్ ధన్వంతి, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, మారుడోజు రాంబాబు, శిరీష్‌రెడ్డి, లింగాజీ, జగదీష్‌చందర్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, కట్టా మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

కడియం రాజీనామా చేసే వరకు వదలం

- భూ చెర పడుతున్న ఆంధ్రా అల్లుడు, బినామీలు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా

- పట్టా భూములను రైతులకు చెందాలనడం కబ్జా చేసినట్టా?
- ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- వివరాలు 8లో▸

మహిళా 'సౌర' శక్తి

- సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్వహణకు రెండు సమాఖ్యలు ఎంపిక
- స్థలం పరిశీలించిన అధికారులు



సోలార్ ప్లాంటు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సు సర్వీసుల బాధ్యతలు అప్పగించిన రేవంత్‌రెడ్డి సర్కారు.. కొత్తగా సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్వహణలో భాగస్వామ్యులను చేస్తున్నది. ఇందుకు సంబంధించి జిల్లాలో రెండు యూనిట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కార్పస్ ఫండ్, బ్యాంకు గ్యారంటీతో మహిళా సంఘాలకు భరోసా కల్పిస్తూ వారి కుటుంబాల్లో సౌర 'వెలుగులు' నింపుతోంది.

స్థల పరిశీలన

రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి శుభం, శుభోదయ, పాలకుర్తి మండలం వావిలాల దుర్గామాత, మహాలక్ష్మి సంఘాలకు సౌర విద్యుత్ ద్వారా రెండు మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్లాంట్ల ఏర్పాటుకు ఒక్కో సమాఖ్యకు 4 ఎకరాల చొప్పున స్థలం కేటాయించనున్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు 2 కిలోమీటర్ల దూరంలో సోలార్ ప్లాంట్లు నిర్మించేలా సర్కారు గైడ్‌లైన్స్ జారీ చేసింది. ఇందుకు తగ్గట్టుగా డీఎం రెడ్‌కో, డీఆర్‌డీఓ, తహసీల్దార్, ఎన్పీడీసీఎల్ ఏఈలతో కలిసిన బృందం రెండు గ్రామాల్లో నిబంధనల మేరకు స్థలం పరిశీలించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందని కలెక్టర్‌కు రిపోర్టు చేయగా.. సర్కారుకు నివేదికను పంపించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్(పీఎం–కుసుమ్) పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో మహిళా సంఘాలకు అప్పగిస్తున్నది. అశ్వరావుపల్లి, వావిలాల గ్రామాల్లో ఒక్కో మెగావాట్ తయారు చేసేలా రెండు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రాజెక్టు ఖర్చు రూ.2.97 కోట్లు కానుంది. సోలార్ ప్లాంటుకు ప్రభుత్వం 4 ఎకరాల స్థలంతో పాటు కార్పస్ ఫండ్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయం చేస్తుంది. మహిళా సంఘాల సభ్యులు రూ.30లక్షలు(10శాతం), మిగతా సొమ్ము ప్రభుత్వ గ్యారంటీ ద్వారా బ్యాంకులు, నాబార్డు ద్వారా రుణాలు ఇప్పించేందుకు సహకారం అందించనుంది. సోలార్ ప్లాంట్‌లో రోజుకు 4వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.3.13 చెల్లించి మహిళా సంఘాల నుంచి కొనుగోలు చేస్తుంది. ఇలా రోజుకు రూ.12వేల ఆదాయం చొప్పున నెలకు రూ.3.36 లక్షల ఆర్థిక వనరులు సమకూరుతాయి. సోలార్ ప్లాంటులో వివిధ రకాల మెయింటనెన్స్‌కు ఒక టెక్నీషియన్, 10 మంది మహిళా కార్మికుల సేవలు అవసరం. వీరికి నెలకు వేతనం కింద రూ.40వేలు ఖర్చు కాగా, బ్యాంకు ద్వారా తీసుకున్న రుణానికి ఈఎంఐ రూ.2.50లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణం 11 నుంచి 12 ఏళ్లలో తీరిపోనుంది. మిగిలిన డబ్బులను సంఘంలో పొదుపు చేసుకోగా.. 12 ఏళ్లు తిరిగే సరికి 4 ఎకరాల భూమి, సోలార్ ప్లాంటు మహిళా సంఘం సొంతం కానుంది.

ప్రభుత్వానికి ఫీల్డ్ రిపోర్టు



అశ్వరావుపల్లి, వావిలాలలోని నాలుగు సంఘాలకు రెండు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి రిపోర్టు పంపించాం. ఒక్కో యూనిట్‌కు నాలుగెకరాల స్థలం అవసరముండగా, ఫీల్డ్ ఎంక్వరీ పూర్తి చేశాం. యూనిట్‌కు రూ.2.97కోట్లు ఖర్చు కానుండగా, ప్రభుత్వం కార్పస్ ఫండ్ కింద రూ.20 లక్షలు, సంఘాలు 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా సొమ్మును ప్రభుత్వం గ్యారంటీగా ఉండి ఇప్పిస్తుంది.

– వసంత, డీఆర్‌డీఓ

అవసరమైతే బ్లాక్ లిస్టులోకి..

- పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క
- పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథపై హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష
- అభివృద్ధి పనుల తీరుపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల అసంతృప్తి
- ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయని అధికారులపై అసహనం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క, చిత్రంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణనీటి సరఫరా, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ శాఖలపై శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీతక్క మాట్లాడుతూ పనులు దక్కించుకోవడంలో చూపుతున్న శ్రద్ధ సకాలంలో పూర్తిచేయడంపై కాంట్రాక్టర్లు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికీ మొదలుపెట్టని పనులకు తిరిగి టెండర్లు పిలవాలని సూచించారు. ఏళ్లుగా పనులు మొదలు పెట్టని, పూర్తిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి పూర్తిచేయించే బాధ్యత ఎస్ఈలదే అని, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు చేయాలన్నారు. టెండర్లకు సిద్ధంగా ఉన్న రోడ్లకు వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి సకాలంలో పనులు పూర్తి చేయించాలని చెప్పారు. నిధుల కొరత లేదని, పీఎంజీఎస్‌వై నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు ఇచ్చిందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదు..

అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టినవి ఇప్పటికీ పూర్తి చేయలేదని, తన పదవి కాలంలోపైనా పూర్తి చేస్తారా అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, రాంచంద్రునాయక్.. మంత్రి, ఈఎన్‌సీ కనకరత్నం దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తి చేయించడంలో అధికారులు వ్యవహరిస్తున్న వైఖరిపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, తాను ప్రతిపాదనలు పంపిన రోడ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మీరు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఒక్కరే ఉన్నారని, అప్పుడు మీకు ప్రభుత్వం ఎంతగానో సహకరించిందని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఒక్కడినే ఉన్నానని, నిష్పక్షపాతంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఎంపీ బలరాంనాయక్ కలుగజేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తే తాము చెల్లిస్తున్నామన్నారు. దీంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇక్కడ రాజకీయాలు చేయడం మంచిది కాదని, రాజకీయాలు బయట చూసుకుందామన్నారు. సమావేశంలో ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి ఉమ్మడి జిల్లాలోని జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలోని మారుమూల గ్రామమైన రాయినిగూడెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఇష్టంగా తినే ఆహారంపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడడమే అందరి లక్ష్యం కావాలన్నారు. 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని వచ్చే ఏడాది కూడా నిర్వహిస్తామని చెప్పారు.

సవాళ్లను అధిగమించాలి..

- సౌత్ ఆఫ్రికా దర్బన్ వర్సిటీ ప్రొఫెసర్ రవీందర్‌రేనా

కేయూ క్యాంపస్: ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపార నిర్వహణ విద్య అనేక సమస్యల్ని, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోంది.. వాటిని నైపుణ్యాలతో అధిగమించాలని సౌత్ ఆఫ్రికా దర్బన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రవీందర్ రేనా అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలో డైరెక్టర్, పాలక మండలి సభ్యులు బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఆయన వ్యాపార నిర్వహణ విద్యపై విస్తృత ఉపన్యాసం చేశారు. మేనేజ్‌మెంట్ విద్యతో బాధ్యతాయుతమైన నాయకులను తయారు చేయడం లక్ష్యమన్నారు. సాంకేతికల ఏకీకరణ, సాఫ్ట్‌స్కిల్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంప్రదాయ మార్కెటింగ్, ఫైనాన్స్ మానవ వనరులకు మించిన క్రియాత్మక రంగాలపై విస్తృత అవగాహన అవసరముందని అన్నారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ వీణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

- ఎన్పీడీసీఎల్ డీఈలు లక్ష్మీనారాయణరెడ్డి, రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట : వ్యవసాయ బావులకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని ఎన్పీడీసీఎల్ డీఈలు లక్ష్మీనారాయణరెడ్డి, రాంబాబు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓవర్‌లోడ్ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న నూతన ట్రాన్స్‌ఫార్మర్లను రాంబాబు శనివారం పరిశీలించారు. అలాగే బచ్చన్నపేట లక్ష్మాపూర్ 11 కేవీ సబ్‌స్టేషన్‌లో అదనపు పీటీఆర్‌ను లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యాన బిగించారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో డీఈలు మాట్లాడుతూ.. సమస్య లేకుండా విద్యుత్ సరఫరాకు సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఏడీ వేణుగోపాల్, ఎంఆర్‌టీ డీఈ విజయ్ కుమార్, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సిబ్బందితో డీఈ రాంబాబు

ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో బాలుడి బలి..

- ట్రాలీ మీద పడి దుర్మరణం
- గిర్నితండాలో ఘటన


విఘ్నేశ్ (ఫైల్)

కొడకండ్ల : ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో ఓ బాలుడు బలి అయ్యాడు. ట్రాక్టర్ ట్రాలీ మీద పడి దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన శనివారం తెల్లవారుజామున మండలంలోని గిర్నితండా శివారులోని పెట్రోల్ బంక్ ఎదుట ఉన్న ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై చింత రాజు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వేరుపాలెం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ కృష్ణ కొడకండ్ల మండలం గిర్నితండా పరిధిలోని పెట్రోల్ బంక్ ఎదుట ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నాడు. ఇటుక బట్టీలకు మట్టి సరఫరా చేసే క్రమంలో ట్రాక్టర్ల లెక్కింపు చేపట్టేందుకు మొండ్రాయి గ్రామానికి చెందిన బాలుడు తండా విఘ్నేశ్(17)ను పనికి కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో బోడోనికుంటకు చెందిన భూక్య రవి.. మట్టి ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతో ట్రాలీ పల్టీకొట్టి పక్కన ట్రిప్పుల లెక్క రాస్తున్న విఘ్నేశ్‌పై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విగ్నేశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న తండా భాస్కర్‌కు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు విఘ్నేశ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాడు. ట్రాక్టర్ నిర్లక్ష్యంగా నడిపి తన కుమారుడి మృతికి కారణమైన డ్రైవర్‌తో పాటు మైనర్ అని తెలిసినా పనికి కుదుర్చుకున్న ఇటుక బట్టీ యాజమానిపై చర్యలు తీసుకోవాలనే మృతుడి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రసాద్ ఆలోచన విధానం ఆదర్శనీయం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నవీన్

విద్యారణ్యపురి: న్యాయవాది కేఎస్ఆర్ జి.ప్రసాద్ ఆలోచన విధానం ఆదర్శనీయమని ప్రముఖ నవలాకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శనివారం హనుమకొండలోని నవీన్ నివాసంలో మిత్రమండలి, రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'కేఎస్ఆర్ జి.ప్రసాద్ జీవితం, కృషి, వర్తమానం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో రచయిత, విమర్శకుడు మెట్టు రవీందర్, రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, న్యాయవాది దివంగత కేఎస్ఆర్ జి.ప్రసాద్ కుమారుడు డాక్టర్ సతీశ్‌చంద్ర, మిత్ర మండలి కన్వీనర్ వీఆర్ విద్యార్థి, తెరసం అధ్యక్షుడు పొట్లపెల్లి శ్రీనివాస్ రావు, రుద్రమ సాహిత్య సామాజిక వేదిక బాధ్యురాలు కొమర్రాజు రామలక్ష్మీప్రసాద్ జీవితాన్ని పరిచయం చేశారు. సాహితీవేత్తలు నాగిళ్ల రామశాస్త్రి, పి.చందు, బిల్ల మహేందర్, చందనాల సుమిత్రా దేవి, డి.శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.


కాజీపేటలోని బీసీ గురుకుల ఉమెన్ 'లా' కాలేజీ భవనం..

గురుకు'లా' ల్లోనూ చదవొచ్చు..

గురుకులాల ద్వారా ఉచితంగా న్యాయవిద్య

- ఐదేళ్ల 'లా' కోర్సు.. టీజీ లాసెట్ ద్వారానే సీట్ల భర్తీ
- రెండేళ్ల క్రితం కాజీపేటలో ఉమెన్, హైదరాబాద్ మహేశ్వరంలో మెన్ కళాశాలలు ఏర్పాటు..
- హాస్టల్ వసతి, మెస్ ఇతర సదుపాయాలు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల క్రితం వరకు యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేట్ కాలేజీల్లోనే 'లా' చదువుకోవాల్సి వచ్చేది. దీనికి వేలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సిందే. ముఖ్యంగా యూనివర్సిటీల కాలేజీల్లో సీట్లకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. ప్రైవేట్ లాకాలేజీల్లోనూ అధిక ఫీజులు చెల్లించి చదువుతున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో సంవత్సరానికి రూ.లక్ష ఫీజు తీసుకునే కాలేజీలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే పేద విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్రంలోని బీసీ గురుకులాల్లో ఉచితంగా న్యాయ విద్యనందించేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితమే చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మహాత్మాజ్యోతిబాపూలే బలహీనవర్గాల విద్యాలయాల సంస్థ ద్వారా ఐదేళ్ల 'లా' కోర్సు ఉచితం అందజేస్తోంది. కాగా, కొన్నేళ్ల క్రితమే రాష్ట్రంలో హైదరాబాద్‌లోని చైతన్యపురిలో సాంఘిక సంక్షేమ గురుకులం బాలికల 'లా' కళాశాలగా ఉంది. అలాగే, సంగారెడ్డిలో గిరిజన సంక్షేమ గురుకులం బాలుర 'లా' కళాశాలగా ఉంది.

బీసీ గురుకులాల ద్వారా..

తెలంగాణ ప్రభుత్వం బీసీ గురుకులాల ద్వారా న్యాయ విద్యనందిస్తుంది. ఇందులో భాగంగా 2023–2024 విద్యాసంవత్సరంలో కాజీపేట సోమిడి రోడ్డులో గురుకుల 'లా' ఉమెన్ కళాశాల ఏర్పాటు చేసింది. అలాగే, హైదరాబాద్ మహేశ్వరంలో గురుకుల 'లా' మెన్ కాలేజీ నిర్వహిస్తోంది. వీటిల్లో ప్రవేశాలకు టీజీ లాసెట్ ద్వారానే అడ్మిషన్లు కల్పిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల్లో తక్కువ ఆదాయం కలిగిన పేద కుటుంబాలకు చెందిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ 'లా' గురుకులాల్లో అడ్మిషన్లు పొందొచ్చు.

అనేక సదుపాయాలు..

ఈ గురుకుల 'లా' కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల గరిష్ట వయోపరిమితి 20 ఏళ్లు ఉంది. వివాహితులకు ప్రవేశం లేదు. విద్యార్థినులు అడ్మిషన్లు పొందాక తప్పనిసరిగా హాస్టల్ వసతి పొందాల్సింటుంది. ఉచితంగా హాస్టల్‌వసతితోపాటు మెస్‌సదుపాయం ఉంటుంది. ఉచితంగా యూనిఫామ్స్, బుక్స్, నోట్‌బుక్స్ కూడా అందజేస్తారు.

కాజీపేట గురుకుల కళాశాలలో 60 సీట్లు..

ప్రస్తుతం హనుమకొండ జిల్లా కాజీపేట సోమిడిలో ఉన్న గురుకుల 'లా' కళాశాలలో విద్యార్థినులకు ఈ విద్యాసంవత్సరం 2025–2026లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 60 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ కళాశాలలో ఫస్టియర్‌లో 24 మంది, సెకండియర్‌లో 30 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రతీ విద్యాసంవత్సరంలో 60 సీట్లు ఉన్నా పూర్తిస్థాయిలో భర్తీకావడం లేదు. న్యాయవిద్యలో స్థిరపడాలనుకునేవారు ఈ గురుకులంలో అడ్మిషన్లు పొందాలని అధికారులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని మహేశ్వరంలో గురుకుల 'లా' మెన్ కళాశాలలో కూడా 60 సీట్లు ఉన్నాయి.

ఇప్పటికే టీజీ లాసెట్ నోటిఫికేషన్

తెలంగాణలో వివిధ యూనివర్సిటీల పరిధిలోని 'లా' కళాశాలల్లో 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను ఉస్మానియా యూనివర్సిటీ ఇప్పటికే టీజీలాసెట్ నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. అపరాధ రుసుములేకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 15 వతేదీ వరకు గడువు ఉంది. రూ. 5 వందల అపరాధ రుసుముతో ఈనెల 25వరకు, రూ. వెయ్యితో మే 5 వరకు, రూ. 2వేలతో మే 15వరకు, రూ 4వేల అపరాధ రుసుముతోమే 25వతేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. కాగా, లాసెట్ జూన్ 6న జరగబోతుంది.

ఎవరికెన్ని సీట్లు..

బీసీ గురుకుల 'లా' కాలేజీలో ఉన్న 60 సీట్లలో బీసీఏ– 13, బీసీ– బీ 15, బీసీ–సీ 2, బీసీ –డీ 11, బీసీ –ఈ 6, ఈబీసీ 1, ఎస్సీ–9, ఎస్టీ –3 సీట్లు కేటాయిస్తారు. ఈ బీసీ గురుకులంలో మొదటి, రెండో సంవత్సరం కలిపి ప్రస్తుతం 54 మంది విద్యార్థినులు చదువుతున్నారు.లాసెట్ ద్వారానే ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

నామమాత్రపు ఫీజు

ఐదేళ్ల 'లా' కోర్సులో ప్రవేశానికి నామమాత్రపు ఫీజు కేవలం రూ. 4వేలు మాత్రమే ఉంది. రూ. 4వేలు కాషన్ డిపాజిట్‌గా అడ్మిషన్ల సమయంలో చెల్లించాల్సింటుంది. కోర్సు పూర్తిచేశాక విద్యార్థులకు తిరిగి చెల్లిస్తారు.

నాణ్యమైన న్యాయ విద్య



గురుకుల 'లా' ఉమెన్స్ కాలేజీలో నాణ్యమైన న్యాయ విద్యనందిస్తున్నాం. నిరంతర పర్యవేక్షణతోపాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన చేయిస్తున్నాం. న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనే విద్యార్థినులు గురుకుల 'లా' కళాశాలలో టీజీసెట్ ద్వారా అడ్మిషన్లు పొందాలి.

- ఎన్ రవి, ప్రిన్సిపాల్, ఎంజేపీటీబీసీడబ్ల్యూ గురుకుల 'లా' ఉమెన్ కాలేజీ, కాజీపేట

కడియం రాజీనామా చేసే వరకు వదలం

- భూ చెర పడుతున్న ఆంధ్రా అల్లుడు, బినామీలు
- గురువులకు పంగనామాలు పెట్టడంలో సిద్ధహస్తుడు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హన్మకొండ: బీఆర్ఎస్ శ్రేణులు శ్రమించి గెలిపించిన కడియం శ్రీహరి రాజీనామా చేసే వరకు వదిలిపెట్టమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ జెండా మీద, బీఆర్ఎస్ కార్యకర్తల కష్టం మీద గెలిచిన కడియం శ్రీహరికి సిగ్గూ శరం, చీము నెత్తురుంటే వెంటనే రాజీనామా చేసి ఉప ఎన్నికలో గెలిచి మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, తాటికొండ రాజయ్య, తనపై ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడారని, దీనిని కడియం విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఆంధ్రా అల్లుడు, బినామీలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో భూములు చెర బట్టారని ధ్వజమెత్తారు. దేవునూర్‌లో 25 ఎకరాలు బినామీ పేరుతో కొనుగోలు చేసి వ్యవసాయం చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నీతివంతునివైతే హైదరాబాద్‌లో మూడు భవనాలు, అమెరికాలో మూడు భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని, హనుమకొండలో అంత పెద్ద ఇల్లు ఎలా నిర్మించావని తూర్పారబట్టారు. కడియం కంటే తాను ఒక్క రోజు తన సొంత నియోజకవర్గంలో లేకున్నా రాజీనామా చేస్తానన్నారు. కడియం తన మొదటి గురువు ఎన్టీఆర్, రెండో గురువు చంద్రబాబు, మూడో గురువు కేసీఆర్‌కు పంగనామాలు పెట్టాడని, కొత్త గురువు రేవంత్ రెడ్డికి కూడా పంగనామాలు పెడతారని పల్లా దుయ్యబట్టారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నాయకులపై కడియం శ్రీహరి నోరు పారేసుకోవడాన్ని ఖండించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, గున్‌రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పులి రజనీకాంత్, జోరిక రమేశ్, చింతల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ నూతన రేషన్ కార్డులు


గొత్తికోయలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: రానున్న రోజుల్లో రేషన్ కార్డు లేని నిరుపేదలందరికీ నూతన కార్డులు పంపిణీ చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని మండల తోగు గూడెంలోని పాఠశాలలో గొత్తికోయలు, విద్యార్థులతో కలిసి మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలు కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. జిల్లాలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున రెండు లక్షల 57 వేల మందికి సన్న బియ్యం అందజేస్తున్నామని వివరించారు. ఆదివాసీ గూడేలు, ఏజెన్సీ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్‌బాబు, ఎంపీడీఓ సుమనవాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏం చేశారని రజతోత్సవ సభ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేసినందుకా..? ఏం చేశారని రజతోత్సవ సభ పెట్టుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలు ఇచ్చి పదేళ్ల ప్రజలను మోసం చేసి, పీడించినందుకా సంబురాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇంతకీ 25 సంవత్సరాల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా, తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పై దుష్ప్రచారం చేయడమే బీఆర్ఎస్ ఎజెండా తప్పితే మరో అంశం లేదన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు డాక్టర్లు పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్, బంక సరళ, బంక సంపత్, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం, ఏటూరునాగారం మధ్య పులి జాడలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎఫ్‌డీఓ రమేశ్


అటవీ శాఖ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎఫ్‌డీఓ రమేశ్

ఏటూరునాగారం : ములుగు జిల్లా తాడ్వాయి, ఏటూరునాగారం అడవుల మధ్య పులి సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని అటవీశాఖ డివిజనల్ అధికారి రమేశ్ శనివారం తెలిపారు. ఏటూరునాగారం నుంచి తాడ్వాయి మండలంలోని మేడారం, బయ్యక్కపేట అడవుల్లో సిబ్బందితో కలిసి పులి జాడ కోసం వెతుకుతున్నామన్నారు. మహాదేవ్‌పూర్ ప్రాంతం బూడిదపెంట గొత్తికోయ గూడెంలో ఓ ఆవును చంపి ఇటువైపు వచ్చినట్లు అక్కడి అటవీశాఖ అధికారుల సమాచారం ఉందన్నారు. ఈ మేరకు అడవులకు దగ్గరలోని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఎవరూ అడవులకు వెళ్లొద్దని సూచించారు. పులి ఆనవాళ్లు, జాడలు కనిపిస్తే వెంటనే అటవీశాఖకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారులు అబ్దుల్ రెహమాన్, అఫ్సరున్నిసా తోపాటు సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా

- పట్టా భూములను రైతులకు చెందాలనడం కబ్జా చేసినట్టా?
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్: దేవునూర్ అటవీ భూమిలో గుంట స్థలం ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపణలు, విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే అంటూ పదేపదే పదవికి రాజీనామా చేయాలనడం సరికాదన్నారు. ప్రస్తుతం ఈ విషయం సుప్రీం కోర్టులో ఉందని, తీర్పునకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 36మంది ఎమ్మెల్యేలు పార్టీ మారి బీఆర్ఎస్‌లో చేరిన విషయం రాజేశ్వర్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. వేరే పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టింది నిజం కదా అంటూ.. పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యకు బీ ఫామ్ ఇచ్చి ఎన్నికల ఖర్చుకు నిధులు ఇచ్చామనడం సరికాదని, ఇది నిరూపిస్తే తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నిరూపించకపోతే పల్లా రాజీనామా చేయాలన్నారు. అటవీ శాఖ నోటిఫికేషన్‌లో లేని 23 మంది రైతులకు చెందిన 43 ఎకరాల పట్టా భూములను రైతులకు చెందాలని అనడం భూమి కబ్జా చేసినట్టా అని ప్రశ్నించారు. దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని హితవు పలికారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అదజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, గుడి వంశీధర్‌రెడ్డి, ప్రవీణ్, కోళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

వనజీవికి నివాళి

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రామయ్య
- ఆయనతో అనుభవాలను పంచుకున్న జిల్లావాసులు


వల్లంపట్ల కళాబృందంతో రామయ్య దంపతులు (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ పురస్కార అవార్డు గ్రహీత వనజీవి (దరిపల్లి) రామయ్యకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వన ప్రేమికులు, ఆయన అభిమానులు నివాళులర్పించారు. రామయ్య శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. వనప్రేమికులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఓరుగల్లుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృక్షప్రేమికులు నిర్వహించిన 'చెట్లు నాటాలి- భూతాపాన్ని తగ్గించాలి' అనే అంశంపై 2019లో అక్టోబర్ 19న హనుమకొండ కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రామయ్య దంపతులు పాల్గొని మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై ప్రసంగించారు.

ఏకశిల యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో 2020లో ఫిబ్రవరి 2, 3వతేదీల్లో నిట్‌లో మేడారం జాతరపై జాతీయ ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామయ్య దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించారు.

నేటితరానికి రామయ్య ఆదర్శం..



నేటితరం రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయనను కలిసి మాట్లాడా. మొక్కల పెంపకంపై రామయ్య కృషిని మరిచిపోవద్దు. పర్యావరణ పరిరక్షణకోసం ఆయన చేసిన వన ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇప్పటి నుంచి అందరం మొక్కలు నాటి హరిత విప్లవంలో భాగస్వాములమవుదాం..

- నిమ్మల శ్రీనివాస్, సామాజికవేత్త, హనుమకొండ

చెట్ల పెంపకంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి..



మా క్లబ్ ఆధ్వర్యంలో నిట్‌లో మేడారం జాతరపై జాతీయ ఓరియంటేషన్‌కు రామయ్య దంపతులను ఆహ్వానించాం.. రామయ్య చెట్ల పెంపకంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి.. జాతరలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రకృతికి హాని జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.. అలాగే, మొక్కలను ఎలా పెంచాలని వివరించిన తీరు ప్రశంసనీయం. రామయ్య దంపతులను క్లబ్ తరఫున ఘనంగా సన్మానించాం.

- ధర్మపురి రాజా గోవింద్, ఏకశిల యునెస్కో క్లబ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

జానకమ్మ సహకారం గొప్పది..



పర్యావరణ పరిరక్షణలో రామయ్య రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేశారు. రామయ్యతో పాటు ఆయన సతీమణి జానకమ్మ కూడా ప్రతీ కార్యక్రమానికి హాజరయ్యేవారు. రామయ్య కృషిలో పాలుపంచుకునేవారు. ఆమె సహకారం గొప్పది.. తన పిల్లలతో పాటు మొక్కలను ప్రాణంగా పెంచుకున్నారు. ఎక్కడైనా ఖాళీస్థలం కనిపిస్తే విత్తనాలు చల్లుతూ, మొక్కలు నాటేవారు. రామయ్య మృతి తీరనిలోటు. నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో మాట్లాడా. ఆ దంపతులను సన్మానించా.

- వల్లంపట్ల నాగేశ్వరరావు, వనప్రేమి అవార్డు గ్రహీత, కవి, రచయిత, కళాకారుడు, హనుమకొండ

కలిసి మొక్కలు నాటాం...



మహబూబాబాద్ రూరల్ : ఎనిమిదేళ్ల క్రితం రామయ్య మహబూబాబాద్ రాగా ఆయనతో కలిసి మొక్కలు నాటాం. మా ఇంటికి వచ్చిన సమయంలో ఆ దంపతులను సన్మానించాం. రామయ్య మృతి సమాజానికి తీరనిలోటు. వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకుని వందరోజుల పాటు నిరంతరంగా మొక్కలు నాటే యజ్ఞం నిర్వహించాం.

- గర్రెపల్లి వెంకటేశ్వర్లు, శ్రీవాసవి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబాబాద్